భద్రత కట్టుదిట్టం చేయాలి



కోల్‌కతా మహిళా వైద్యురాలి ఘటన తీవ్రంగా కలచివేస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, సిబ్బందికి అండగా నిలవడంతో పాటు ఆయా ఆసుపత్రుల్లో అన్ని వసతులు సమకూర్చి భరోసా కల్పించాలి.

–డాక్టర్ మీనాక్షిరెడ్డి,
విశ్రాంత డిప్యూటీ సివిల్ సర్జన్, బద్వేలు

రక్షణకు చర్యలు తీసుకోవాలి



వైద్య వృత్తినే పరమావధిగా భావించి సేవ చేస్తున్న డాక్టర్ల రక్షణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలి. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన ఘటన చాలా దారుణం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలి.

– డాక్టర్ ఎస్.రోషిణి,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దువ్వూరు



కఠిన చట్టాలు అవసరం



మహిళల రక్షణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తెచ్చి అమలు చేసినప్పుడే మహిళలు ఉద్యోగాలను స్వేచ్ఛగా చేయగలగుతారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసిన ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇలాంటి ఘటనలకు కారణమైన వారిని ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలి.

– అర్దాకుల లక్ష్మీదేవి, న్యాయవాది, దువ్వూరు

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు శుభపరిణామం



ప్రభుత్వాసుపత్రుల్లో పటిష్టమైన పోలీసు ఔట్‌పోస్టు ఉండాలి. అత్యవసర విభాగం ప్రాంతంలో అదనపు భద్రత ఉండేలా చూసుకోవాలి. 24 గంటలు పని చేసిన నైట్ డ్యూటీ డాక్టర్లకు డ్యూటీ హాఫ్ తప్పకుండా ఇవ్వాలి. సుప్రీంకోర్టు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామం.

– డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి,
ప్రముఖ కార్డియాలజిస్టు, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఉర్దూ మాధ్యమంలో గెస్ట్ అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ అర్హత కలిగి ఉర్దూ మాధ్యమంలో బోటనీ, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో 50 మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 27వ తేదీలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని, 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



నిందితులతో ఎస్ఐ కత్తి వెంకటరమణ

రాజుపాళెం : పర్లపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాజుపాళెంలో పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కత్తి వెంకటరమణ మాట్లాడుతూ పర్లపాడు గ్రామంలో అక్రమం మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మర్రి భూషణం, బడుగుగాల్ల కమాలుద్దీన్ నుంచి 85 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం



సూచనలిస్తున్న వైద్యాధికారి ఓబులేసు

చాపాడు: ఎయిడ్స్‌ను నిర్మూలిద్దామని వైద్యాధికారి డా.ఓబులేసు పిలుపునిచ్చారు. మండలంలోని కేతవరం గ్రామంలో శుక్రవారం చైల్డ్ ఫండ్ ఇండియా స్కీం ఆధ్వర్యంలో ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్ఐవీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, ఈ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, ఎస్‌పీసీ పర్యవేక్షకులు రమేష్, ఏఎస్ఎం కీర్తిదాయిని, చైల్డ్ ఫండ్ ఇండియా సిబ్బంది మహబూబ్ బాషా, దర్బార్, సురేంద్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



గాయపడ్డ వినోద్‌కుమార్ దంపతులు

పోరుమామిళ్ల: మండలంలోని పుల్లివీడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. కలసపాడుకు చెందిన ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ దంపతులు మైదుకూరుకు బైక్‌పై వెళుతుండగా పుల్లివీడు వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో దంపతులు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బద్వేలు అర్బన్ : పట్టణంలో పారిశుద్ధ్య, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని బద్వేలు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా నరసింహారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏఓగా పనిచేస్తున్న ఆయనను బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని సీఐ దేవకిరణ్‌కుమార్ తెలిపారు. ట్రాఫిక్ సీఐగా శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. 1998 బ్యాచ్‌కు చెందిన దేవకిరణ్‌కుమార్ కడప సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తూ బదిలీపై ప్రొద్దుటూరుకు వచ్చారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ ఈ సందర్భంగా తెలిపారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయరాదన్నారు.

సింగిల్ రోడ్డుతో అవస్థలు

- డబుల్ లైన్ రహదారి వేయరూ...!
- స్థానికుల వినతి



వెంగళాయపల్లె నుంచి జమ్మలమడుగుకు వెళ్లే సింగిల్ రోడ్డు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెంగళాయపల్లె నుంచి పర్లపాడు, పెద్దపసుపల మీదుగా జమ్మలమడుగుకు వెళ్లే సింగిల్ రోడ్డును డబుల్ లైను రహదారిగా విస్తరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రాజుపాళెం నుంచి జమ్మలమడుగుకు వెళ్లేందుకు డబుల్‌లైను రోడ్డు వేయడంతో ఎంతో సౌకర్యం కలుగుతుంది. రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి అనుసంధానంగా ఉంటుంది. జమ్మలమడుగు నుంచి పెద్దపసుపల మీదుగా వెంగళాయపల్లె వరకు వచ్చే ఈ రహదారి ప్రొద్దుటూరు–ఆళ్లగడ్డ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉంది. ఈ రోడ్డు సింగిల్ రోడ్డుగా ఉండటం వలన తరచుగా వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతినిత్యం ఈ రహదారిలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అందువల్ల తప్పనిసరిగా విస్తరించాల్సి ఉంది. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డును విస్తరించాలని ప్రతిపాదన ఉన్నప్పటికి దాని ఆచరణలో అమలు చేయడం లేదు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు వాహనదారులు, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డు వెడల్పు చేసేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు విస్తరణకు 2019లో సర్వే

2019 సంవత్సరంలోని డిసెంబరు నెలలో బెంగుళూరులోని ఎక్సలాన్ సర్వే సంస్థ ఈ రోడ్డు వెడల్పు పనులకు సంబంధించి సర్వే కూడా చేసింది. గతంలోనే జీపీఎస్ యంత్రం ద్వారా సర్వే పనులు నిర్వహించిన ఆ సంస్థ తిరిగి రెండో మారు రోడ్డు లెవల్ పనులను సర్వే చేశారు. ఈ రహదారికి సుమారుగా రూ.30 కోట్లు నిధులు అవసరం కానున్నాయి. ప్రొద్దుటూరు నుంచి రాజుపాళెం వయా వెల్లాల మీదుగా కర్నూలు జిల్లా చాగలమర్రి వద్ద ఉన్న జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు మార్గ మధ్యంలో వెంగళాయపల్లె నుంచి జమ్మలమడుగు వరకు 21 కిలోమీటర్ల వరకు ఉంది. ఎన్నో ఏళ్లుగా డబుల్ రోడ్డు కోసం ఈ ప్రాంత ప్రజలు నిరీక్షిస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి వెళ్లే గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని భావించిన వాహనదారులు, ఆయా గ్రామస్తులకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి డబుల్ లైను రోడ్డు వేయాలని కోరుతున్నారు.

డబుల్ రోడ్డు వేయాలి



వెంగళాయపల్లె నుంచి జమ్మలమడుగు రహదారి డబుల్ రోడ్డు వేయాలి. ప్రతిరోజు ద్విచక్ర వాహనాలు, లారీలు, ట్రాక్టర్లు ఈ దారిలో తిరుగుతుంటాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇరుకు రోడ్డు వలన ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి.

– రెడ్డి సుబ్బిరెడ్డి,
వాహనదారుడు, పర్లపాడు గ్రామం, రాజుపాళెం మండలం

సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు



ప్రస్తుతం సింగిల్ రోడ్డుతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వరిగడ్డి ట్రాక్టరు వెళుతుంటే మరో వాహనం వెళ్లేందుకు వీలు ఉండదు. డబుల్ రోడ్డు వేస్తే ఇబ్బందులు తొలగిపోతాయి. అధికారులు స్పందించి డబుల్ లైను రోడ్డు వేయాలి.

– రవి,వాహనదారుడు,
సోమాపురంగ్రామం, రాజుపాళెం మండలం

మట్కా నిర్వాహకుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక వాస్తు కాంప్లెక్స్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడిలో మైఖేల్, గన్నా, చాంద్‌బాషాలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.60 వేలు నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

రూరల్ పరిధిలోని మీనాపురం క్రాస్ వద్ద ప్రమీలమ్మతోపాటు మరో ఐదుగురు మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 34 వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బద్వేలు అర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అసోసియేట్ అధ్యక్షుడు పెద్దిరెడ్డిసతీష్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలో పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 10 వేల మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. సిద్దవటం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఆర్డీఓ కార్యాలయ భవనం నుంచి బయనపల్లె సబ్‌స్టేషన్ వరకు తొలిదశలో 120 మొక్కలు నాటనున్నారు. బద్వేలు ఆర్డీఓ, తహసీల్దారు, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, అర్బన్, రూరల్ సీఐలు, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ చేతులమీదుగా శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బి.గురుమూర్తి, సి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కలసపాడు : పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. శుక్రవారం మండలంలోని పుల్లారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల పరిసరాల్లోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని అదే గ్రామానికి చెందిన యువకులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవడం వలన విద్యార్థులు రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ప్రతి గ్రామంలోని యువత వారి గ్రామాల్లోని పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావాలని కోరారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

బి.కోడూరు : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని పోరుమామిళ్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావణం పిచికారీ చేయించారు. సెక్రటరీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ జయరామిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సోమీ,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవికి పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో శ్రావణమాస మూడవ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌ను విశేషంగా రంగురంగుల పూలతో, ఒట్టి వేరుతో దండలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు.



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరిదేవి

ఆశాలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రొద్దుటూరు : ఆశా కార్యకర్తలపై ఉద్యోగులు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17 ఏళ్లుగా జిల్లాలో ఆశా కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు, నవజాత శిశువులకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆశా కార్యకర్తలు ఉద్యోగాలకు రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఆశాలు విధులు సక్రమంగా నిర్వహించలేదంటూ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని, ఫిర్యాదుల ఆధారంగా అధికారులు నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఇసుక కొరతతో ఉపాధి కరువు

ఇసుక కొరతతో ఇటుక బట్టీల మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 250 ఇటుక బట్టీలలో 60 బట్టీలు ఇసుక కొరత కారణంగా మూతపడ్డాయన్నారు. ప్రభుత్వం ఇటుక బట్టీల నిర్వాహకులు, కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి ఇసుక సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.హరి, మచ్చా శ్రీను పాల్గొన్నారు.

కొత్త వారితో పార్టీకి పూర్వ వైభవం

ఖాజీపేట : ఉమ్మడి కడప జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం కోసం కీలక బాధ్యతలను కొత్త వారికి అధిష్టానం అప్పగించిందని ఏపీఎస్ ఆర్టీసీ కడప మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నమయ్య జిల్లా అధ్యక్ష బాధ్యతలను రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి, కడప జిల్లా బాధ్యతలను కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి అప్పగించడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎండిపోతున్న పసుపు పంట



ఎండబెట్టతో ఎండిపోతున్న పసుపు ఆకులు

మైదుకూరు : ఎండాకాలాన్ని తలపిస్తున్న ఉష్ణోగ్రతలతో రైతులు సాగు చేసిన పసుపు పంటకు ఎండ బెట్ట తగిలింది. మైదుకూరు ప్రాంతంలో ఎండ బెట్ట వల్ల పసుపు పంట దెబ్బతింటోంది. మైదుకూరు ప్రాంతంలో రైతులు 30–50 రోజుల కిందట పసుపు పంటను సాగు చేయగా, అధిక ఉష్ణోగ్రతలతో ఆకులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వనిపెంట ప్రాంతంలో పసుపు ఆకులు ఎండిపోతున్న విషయాన్ని వనిపెంట ఉద్యాన సహాయకుడు మధుసూదన్ రెడ్డి దృష్టికి రైతులు తీసుకెళ్లారు.

నివారణ చర్యలు

పసుపు ఆకులు ఎండిపోవడంపై ఉద్యాన సహాయకుడు మధుసూదన్‌రెడ్డి నివారణ చర్యలు సూచించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. పసుపులో బెట్ట నివారణ కోసం నానో యూరియా 2.5 మిల్లీలీటర్ లేదా 19.19.19. 10 గ్రాముల లేదా బైయోజైమ్ 1 మిల్లీలీటర్‌ను ఒక లీటర్ నీటికి, బావిస్టున్ 1 గ్రాము లేదా కవచ్ 2 గ్రాములుతో కలిపి 15 రోజుల్లో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. అలాగే పంట బెట్టకు గురికాకుండా వారం రోజుల్లో రెండు సార్లు నీటి తడులు ఇవ్వడం వలన బెట్టను నివారించవచ్చని వివరించారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

బద్వేలు అర్బన్ : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రదర్శలు దోహదం చేస్తాయని ఫాతిమా ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్యోతిషా, రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ టి.రత్నంలు పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో విద్యార్థులతో విభిన్న ఆకృతులలో రాకెట్, ర్యాడర్ ప్రదర్శనలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించడానికి ఇటువంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయని అన్నారు. అలాగే విద్యార్థులు చిన్నతనం నుండే అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో అంతరిక్ష దినోత్సవం

మైదుకూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్–3 ద్వారా చంద్రమండంలోని దక్షిణ ప్రాంతానికి చేరిన ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినంగా జరుపుకొంటున్నామన్నారు. విక్రమ్ సారాభాయ్ నుంచి నేటి ఇస్రో చైర్మన్ సోమనాథ్ వరకు అంతరిక్ష యానంపై చేసిన కృషిని ఆయన విద్యార్థులకు వివరించారు.

సైబర్ సెక్యూరిటీ ప్రతి కంపెనీలో భాగమే

ప్రొద్దుటూరు కల్చరల్ : నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ ప్రతి కంపెనీ వ్యూహంలో భాగమని ఐసీటీ అకాడమి రాష్ట్ర హెడ్ దినకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సాయిరాజేశ్వరి ఇన్స్టిట్యూట్‌ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఐసీటీ అకాడమి ఆధ్వర్యంలో విద్యార్థి సాధికారతలో భాగంగా హనీవెల్ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో 100 గంటల ఉచిత సైబర్ సెక్యూరిటీ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో భద్రత చాలా అవసరమన్నారు. విద్యార్థులు సైబర్ సెక్యూరిటీపై శిక్షణ పొందడం వల్ల స్కిల్ డెవలప్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, కళాశాల చైర్మన్ రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, హెచ్ఓడీ సుబ్బారెడ్డి, ఐసీటీ అకాడమి ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రశాంత్,అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



ప్రొద్దుటూరు : వినతిప్రతం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



కాశినాయన : గ్రామసభలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్

చాపాడు: ప్రజల అభీష్టం మేరకూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు అన్నారు. మండల వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవరం గ్రామ సభలో ఎంపీడీఓ మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద పలు రకాలైన అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, స్మశానాలు, రోడ్ల అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఎంఈఓ రవిశంకర్, వెలుగు ఏపీఎం వెంకటరమణ పాల్గొన్నారు.

అభివృద్ధే గ్రామ సభల లక్ష్యం

పోరుమామిళ్ల: పంచాయతీల అభివృద్ధే గ్రామ సభల లక్ష్యమని వైస్ ఎంపీపీ సీఎం బాషా అన్నారు. శుక్రవారం మేజర్ పంచాయతీ పోరుమామిళ్లలో సర్పంచ్ యనమల సుధాకర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో బాషా మాట్లాడుతూ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ పోరుమామిళ్ల పంచాయతీలో అభివృద్ధి కుంటు పడిందన్నారు.

వినతిపత్రం అందజేత

పోరుమామిళ్ల గ్రామపంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, స్వచ్ఛభారత్ కార్మికులకు జీతాలు ఇవ్వాలని శుక్రవారం సీపీఐ నాయకులు గ్రామసభలో వినతిపత్రం ఇచ్చారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

కాశినాయన : గ్రామాల అభివృద్ధి, అవసరాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామ ప్రజలు సమిష్టిగా ఏర్పడి పనులను గుర్తించాలని ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టబోయే పనులను స్థానిక సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను గ్రామసభలో నమోదు చేసుకున్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు : పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమలువారిపల్లె గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. సభకు సర్పంచ్ మోపూరి ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. చౌదూరు గ్రామంలో సర్పంచ్ చంద్ర అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు ఎంపీపీ శేఖర్ యాదవ్ హాజరయ్యారు.

బి.కోడూరు : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు ప్రణాళికబద్ధంగా చేపట్టాలని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పది పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు సంబంధించి ఉపాధి సిబ్బందితో పాటు మండల స్థాయి సిబ్బంది, స్పెషలాఫీసర్లు, సూపర్‌వైజర్లతో గ్రామసభలు నిర్వహించారు.

ప్రణాళిక ప్రకారం ఉపాధి పనులు

గోపవరం : ఉపాధి హామీ పథకం ద్వారా 2024–2025 ఆర్థిక సంవత్సరంలో ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు. ఈఓపీఆర్డీ హసీనా, ఏపీఓ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జరిగిన గ్రామ సభలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసమే గ్రామ సభ నిర్వహిస్తున్నామన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రజలు, ప్రజాప్రతినిధుల సలహాలతో పంచాయతీలకు అవసరమైన పనులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు.



చాపాడు: గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు



గోపవరం: మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి విజయకుమార్



గ్రామసభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్